


పక్కింట్లో పేరంటానికెళ్ళొచ్చే సరికి పిల్లలంతా యిల్లు పీకి పందిరే సారు. పైగా ఒకళ్ళ మీదొ కళ్ళు కంప్లెయింట్లు. 'నానమ్మా... నన్ను నెత్తిమీద కొట్టాడంటే 'నన్ను గిల్లాడని మరొకడు.

"అబ్బబ్బ.. ఏం పిల్లలో ఏమో... ప్రాణాలు తోడేస్తున్నారు. ఆ సరళ ఎలా వేగుతోందో వీళ్ళతో. శెలవు లెప్పుడిస్తారా... అబ్బాయి పిల్లల్నెప్పుడు పంపుతాడా... అని ఎదురు చూసినంత సేపుండదు... ఎప్పుడయి పోతాయా అని ఎదురు చూడ్డానికి... ఏమిటో..." అనుకుంటూ చేతిలోని స్వీట్లు యిద్దరికీ యిచ్చి మూడో వాడి కోసం చుట్టూ చూశాను.

పెరట్లో మూలన కూర్చుని ఒక్కడూ... ఏదో తవ్వుతున్నాడు పుల్లతో.

"ఏం చేస్తువున్నావురా అంత మూలకిపోయి... పురుగూ పుట్రా వుంటాయి" అంటూ అక్కడి వెళ్ళిన నేను వాడు చేస్తున్న పనికి ఒకింత ఆశ్చర్యపోయాను. ఏవో గింజలు అక్కడక్కడా చిన్న గుంతలుచేసి పాతి పెడుతున్నాడు.

"వాలుగేళ్ళు పూర్తిగాలేవు. అప్పుడే వాడికి ఎంత శ్రద్ధో మొక్కల మీద... తాత లక్షణాలు బాగానే వచ్చాయి... వెతుక్కుంటూ.." అంటూ వాలో నేనే నవ్వుకుంటూ వాడి పక్కనున్న డబ్బా చూసి గతుక్కుమన్నాను.

"ఇందులో గింజలా నాయనా... నీవింత సేపూ పాతేవు!" అంటూ గబుక్కున డబ్బా తీసుకుని చూసాను. సగమే వున్నాయందులో.

బట్టల మనిషి.. లెక్కలు రాక... బట్టలు రేవుకి తీసుకెళ్తూ...' లెక్కలకి బదులుగా గింజల్ని ఉపయోగిస్తుంది. చీరలకో రకం గింజలు, పంచెలకో రకం గింజలు, చొక్కాకో రకం, జాకెట్లవో రకం గుర్తుగా పెట్టుకుని వాటన్నింటిని డబ్బాలో పోసి ఒకటోట పెడ్తుంది.

వాటి ప్రకారం సాయంత్రం బట్టలు అప్పగించేస్తుంది.

చాలా ఏళ్ళుగా యిదే పద్ధతి. ఏనాడూ తేడా రాకపోవటంతో నాకూ బాగానే అన్పిస్తోంది.

"వీడి దుంపతెగ... వీడి కెక్కడ దొరికిందో ఈ డబ్బా. అది బట్టలు కూడా ఈ రోజే పట్టుకెళ్ళింది." అనుకుంటూ డబ్బా బోర్లించాను.

అప్పటికే సపోటా, చింత గింజల్ని పాతేశాడు. సీతాఫలం, కుంకుడు లాంటి కొన్ని గింజలు మాత్రం మిగిలాయి.

"ఇవ్వు... నానమ్మా... మన పెరడంతా పెద్ద తోట చేసేస్తా.." అంటూ కూడా పద్దాడు.

"చాల్లే...ఊరుకో.. యిప్పటికే చీరల్ని, లంగాల్ని పాతేశావ్. :ఇంకా నయం. మీ తాతగారి పంచెలు, చొక్కాలు మిగిల్చావు. గింజల్ని పాతావని తెలిస్తే అదేమంటుందో.."

ఇదివరకెన్నడూ లేనంతగా రత్తి కోసం ఎదురుచూడ్డం మొదలెట్టాను.

దీపాలు పెట్టే వేళకి రానే వచ్చింది బట్టల మూటతో. మూటవిప్పి ఏ రకానికా రకం... విడివిడిగా వరుసల్లో పెట్టి డబ్బా కాడికెళ్ళింది గింజల కోసం.

ఏమీ ఎరగనట్లే గమనిస్తున్నాను 'ఏం చేస్తుందా' అని.

"పెద్దమ్మగోరూ... గింజల డబ్బా యాడెట్టి నారమ్మా" అంది చుట్టూ వెతుకుతూ.

"ఉదయం బట్టలన్నీ లెక్కచూసి నువ్వే గదే ఎక్కడో పెట్టావు. చూడు అక్కడే వుంటుంది. ఎక్కడకు పోతుంది పెట్టిన చోట వుండక" అన్నాను అమాయకత్వం నటిస్తూ.

కాసేపు అటూ యిటూ తిరిగి ఎక్కడా దొరక్క విసుగొచ్చి నట్టుంది. మంచం దగ్గరకొచ్చి–

"రండమ్మా లెక్క సెబుతున్నా... అన్నీ వచ్చినయ్యో లేదో సూస్కోండి..." అంటూ ఒకటో... రెండూ...' అంటూ మొత్తం పది నిమిషాల్లో లెక్క చూసేసి అక్కడ పెట్టింది.

"గింజల్దొరికినాక లెక్కేసుకోం డమ్మా. పానెం బోయినా తేడా రాదు. తమరొక్కరియే గుంజినా నీ పొద్దు"

నాకవేం వినపడటం లేదు.

దానికి అంకెలెప్పుడొచ్చాయా అని ఆలోచస్తూ ఆమాటే అడిగాను.

సిగ్గుగా చూసింది. అడగ్గా అడగ్గా చెప్పింది.

"రేతురుళ్ళు అచ్చర దీప్పేల్లు వచ్చి పాతాల్జెప్తతుండరు గదమ్మా. మా మడేలుతో గబ్బి ఆడనే కూకుంటన్నా. ఆ యమ్మ పద్దేలు సెబుతుంటే నేనే దైర్నం సేసి అడిగినా "పద్దేలు నిదానంగా నేర్సుకుంటం గానీ.. అంకెల్సెప్పే మని. గూడెపోల్లు కూడా నా మాటవే అడిగిన్రు. ఆ యమ్మ పాతిక దాకా అంకెల్నేర్పినాదండి..!" అంది సిగ్గు పడుతూనే.

"ఓసి నీ పిగ్గు మొగ్గలవ్వ. బాగానే నేర్పినావు, మరింత దాకా చెప్పలేదేమే" అన్నా. ముసి ముసి నవ్వుల్తో మళ్ళీ అంది.

"నేనేటి నేర్సి నాలెండమ్మా. అంకెలే గదా.

మీ మడేలు అచ్చరాలే నేర్సేసి నాడుండి. ఆడు..... ఊళ్ళో యిస్తిరీ బండేత్తాడంటమ్మా.. ఆడే సోయంగా దరకాత్తు రాసి బాంకిలో బండి కోసం లోను కెట్టినాడండి.." అంటూ ఆనందంతో అది చెబుతుంటే ఆ కళ్ళలోని మెరుపు నాకెంతో ముచ్చటగా అన్పించింది.

చీకట్లు చీలుస్తూ హాల్లో లైట్లు వేశాను.

◑

## తక్కువ!

అప్పారావు భార్య మీద మండిపడ్డాడు –

"ఏం ఖర్చులు, ఏం లోకం? ఈ బిల్లులు చూస్తుంటే కళ్ళు తిరిగిపోతున్నాయ్! వెచ్చాల బిల్లులు, టెలిఫోన్ బిల్లు, బట్టల బిల్లు, కరంటు బిల్లు – ఏది తగ్గినా నేను సంతోషిస్తాను" అన్నాడు.

అక్కడే వున్న పుత్రరత్నం, "అయితే డాడీ! నా ప్రోగ్రస్ కార్డు చూడండి – అన్నీ తక్కువే!" అన్నాడు.

– కొడిమెల శ్రీరామమూర్తి

